సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా భారతి సిమెంట్



ప్రమాద బీమా బాండ్లను అందజేస్తున్న ప్రతినిధులు

నిజాంపేట్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రా ఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజినీర్ శివకుమార్ అన్నారు. శనివారం బాచుపల్లిలోని వినాయక స్టీల్ ట్రేడర్స్ డీలర్‌షాప్‌లో తాపీ మేస్త్రీల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని తెలిపారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని అన్నారు. తాపీ మేస్త్రీలకు లక్ష రూపాయల ప్రమాద బీమా బాండ్లను 30 మందికి అందజేశారు. డీలర్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. భారతి సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందని తెలిపారు.

ప్లే స్కూల్‌లో గ్రీన్ కలర్ వేడుకలు



కుత్బుల్లాపూర్: చింతల్ వేంకటేశ్వర నగర్‌లోని బచ్‌పన్ ప్లే స్కూల్‌లో శనివారం గ్రీన్ కలర్ వేడుకలను నిర్వహించారు. పాఠశాల అకడామిక్ డైరెక్టర్ డాక్టర్ పూర్ణిమ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. చిన్నారులు ఆకుపచ్చ రంగుకు సంబంధించిన వివిధ రకాల కూరగాయలు, పండ్లు, పక్షులు, జంతువుల వేషధారణలో వచ్చి చూపరులను అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేదలను ఆదుకునేందుకు కృషి



దివ్యాంగుడికి మూడు చక్రాల టీవీఎస్ వాహనాన్ని అందజేస్తున్న సురేష్‌కుమార్

రంగారెడ్డినగర్: నిరుపేదలను ఆదుకునేందుకు లార్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ముందుంటుందని సంస్థ వ్యవస్థాపకుడు, లయన్ సురేష్‌కుమార్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ నందానగర్‌కు చెందిన దివ్యాంగుడికి శనివారం మూడు చక్రాల టీవీఎస్ వాహనాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బైక్‌కు తనవంతు సహాయంగా రూ.90వేలు అందజేశానని, మూడు చక్రాల బైక్ అందించడం ద్వారా అతని భార్య, పిల్లలను పోషించుకునే స్థోమత కల్పించినందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహతో తోటి వారికి తోచిన సాయం చేయాలని కోరారు.



రంగారెడ్డినగర్ డివిజన్ గిరినగర్‌కు చెందిన సామాజికవేత్త ఉదయ్ గంజి తన జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. అతడిని సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

- రంగారెడ్డినగర్



ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీలోని ఓ పరిశ్రమ నుండి వెలువడుతున్న పొగ



జీడిమెట్ల ఫేజ్ 3లో పరిశ్రమ నుండి ..

కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి!

పరిశ్రమల నుంచి వెలువడుతున్న పొగ, కాలుష్యంతో ప్రజలు వివిధ రోగాల బారిన పడుతున్నారు. జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతం దట్టమైన పొగతో నిండుతోంది. చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీల ప్రజలు ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలుష్యం వెదజల్లే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



పారిశ్రామికవాడలో కమ్ముకున్న పొగలు

- పగలు, రాత్రి తేడా లేకుండా పరిశ్రమల నుంచి ఘాటు వాసనలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పీసీబీ అధికారులు

జీడిమెట్ల: పరిశ్రమల్లో కాలుష్యరహిత ఉత్పత్తులను చేపట్టాలని ప్రభుత్వం, అధికారులు అవగాహన సదస్సులు చేపట్టిన ఫలితం మాత్రం అంతంతమాత్రంగానే ఉంటుంది. ప్రతినిత్యం పరిశ్రమల నుంచి కాలుష్యం వెలువడుతూనే ఉంది. అధికారులు పూర్తి స్థాయిలో పొల్యూషన్‌ను కంట్రోల్ చేయలేక పోతున్నారు. ప్రతినిత్యం పరిశ్రమల నుంచి పొగలు వెలువడుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీడిమెట్ల పారిశ్రామికప్రాంతానికి ఆనుకుని ఉన్న సమీప కాలనీల ప్రజలు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పీసీబీ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్న వారు తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటున్నారే తప్ప కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమల పట్ల కఠినంగా వ్యవహరించడం లేదని ప్రజలు వాపోతున్నారు. కొన్ని ఫార్మా, బల్క్ డ్రగ్ పరిశ్రమలు పగలు, రాత్రి తేడా లేకుండా పరిశ్రమల పొగగొట్టాల ద్వారా పొగలను బయటకు వదులుతున్నారు. ఇప్పటికైనా పీసీబీ అధికారులు కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమల పట్ల చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాస్వామ్యంలో చీకటి రోజు ఎమర్జెన్సీ



సదస్సులో పాల్గొన్న బీజేపీ శ్రేణులు

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

నిజాంపేట్: ఎమర్జెన్సీ భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఓ చీకటి రోజని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. 1975లో భారతదేశంలో విధించబడిన ఎమర్జెన్సీకి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షులు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లు మాధవితో పాటు హాజరై ఆయన మాట్లాడారు. ఎమర్జెన్సీ కాలంలో ప్రజాస్వామ్యానికి ఎదురైన సవాళ్లను గుర్తు చేశారు. ఎమర్జెన్సీ భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక గాఢమైన అధ్యాయమని, ఆ కాలం మనకు తెలిపిన ప్రధాన బోధ రాజ్యాంగాన్ని, మౌలిక హక్కులను కాపాడే బాధ్యత ప్రతి పౌరునిపైన ఉందని అన్నారు. యువత చరిత్రను తెలుసుకొని ప్రజాస్వామ్య పరిరక్షణలో తమ పాత్రను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు శిల్పారెడ్డి, మేడ్చల్ అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శులు విగ్నేష్‌చారి, వర్ధన్‌రెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, శివరాత్రి దామోదర్, నందనం దివాకర్, ప్రసాద్‌రాజు, నరేంద్ర చౌదరి, బిక్షపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఉద్యమానికి పూర్తి మద్దతు



మల్లన్నకు మద్దతు తెలుపుతున్న నాయకులు

నిజాంపేట్: తీన్మార్ మల్లన్న బీసీల కోసం చేపడుతున్న ఉద్యమానికి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీసీ కోర్ కమిటీ అధ్యక్షులు లింగాల గంగాధర్ ఆధ్వర్యంలో శనివారం తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. శనివారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, తెలంగాణ బీసీ పొలిటికల్ జేఏసీ కో ఆర్డినేటర్ కమిటీ చైర్మన్ సుదగాని హరిశంకర్‌గౌడ్‌లను కలిసి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ సమన్వయకర్త వట్టి జానయ్య యాదవ్, బందారపు నర్సయ్యగౌడ్, ఎలబోయిన ఓదేలు యాదవ్, నాయకులు సింగారం రవీందర్, బయ్య వెంకటేశ్వర్లుయాదవ్, బొడ్డుపల్లి చంద్రశేఖర్, కుంచెపు రమా, తడకంటి సాయిరాజ్, ఇంద్రకంటి శ్రీనివాస్‌గౌడ్, కుర్మయ్య, ఎంబరి రాజయ్య పాల్గొన్నారు.

ఉత్కృష్ట సేవా పతకం అందుకోనున్న బాలానగర్ డీసీపీ



జీడిమెట్ల: బాలానగర్ డీసీపీగా విధులు నిర్వహిస్తున్న కె.సురేష్‌కుమార్ కేంద్ర ప్రభుత్వం ఉత్కృష్ట సేవా పతకం ప్రకటించింది. 15 సంవత్సరాలుగా శాంతి భద్రతలు, కమ్యూనిటీ పోలీసింగ్, మావోయిస్టు నిరోధక కార్యకలాపాలలో భాగంగా ఆయన చేసిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం ఈ పతకాన్ని ప్రకటించింది. ప్రత్యేకంగా ములుగు, భూపాలపల్లి, ఆసిఫాబాద్, జిల్లాల్లో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా అనేక సేవా కార్యక్రమాల ద్వారా ఆయన గుర్తింపు పొందారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంత్‌రెడ్డి



వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్: ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధిలోని కౌసల్య కాలనీలోని చిల్డ్రన్స్ పార్క్‌లో నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు గతంలో విన్నవించారు. వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి నూతన బోర్‌వెల్‌ను మంజూరు చేయించారు. సొంత ఖర్చుతో పదివేల లీటర్ల వాటర్ ట్యాంక్‌ను ఇప్పించారు. శనివారం నూతన బోర్ వెల్, ట్యాంక్‌ను ముఖ్య అతిథిగా హాజరై ఎస్‌ఎంసీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు తిరుపతిరెడ్డి, కృష్ణ యాదవ్, వేణుగోపాల్‌రెడ్డి, నవీన్, హరీష్‌రెడ్డి, గంగారెడ్డి, సంతోష్‌రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, ప్రసాద్‌రావు, వెంకట్‌రెడ్డి, రంజిత్, నాగేశ్వర్ రెడ్డి, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీకి కుర్చీలు అందజేత



అంగన్‌వాడీ విద్యార్థులతో కార్పొరేటర్లు

జగద్గిరిగుట్ట: రాజీవ్ గృహకల్ప కూన మహాలక్ష్మి నగర్‌లోని సంస్కృతి పాఠశాల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ విద్యార్థులకు కుర్చీలను అందజేశారు. శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కార్పొరేటర్లు కొలుకుల జగన్, మంత్రి సత్యనారాయణ స్థానికంగా ఉన్న 6 అంగన్‌వాడీ సెంటర్ పిల్లలకు వాటిని అందజేశారు. ప్రయివేట్ పాఠశాలల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ విద్యార్థులకు కుర్చీలను అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జగద్గిరిగుట్ట సెక్టార్ అంగన్‌వాడీ సూపర్ వైజర్ శ్రీదేవి, పాఠశాల కరస్పాండెంట్ గడ్డమీది బాలరాజు, నాయకులు మహంకాళి, ఎర్ర లక్ష్మయ్య, ఆంజనేయులు, ప్రభాకర్, శ్రీనివాస్, గిరి, అంగన్‌వాడీ టీచర్లు రాధిక, జరీనా, అరుణ, విజయలక్ష్మి, తులసి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎల్లవేళలా సహకారం



స్కూల్ బ్యాగులతో విద్యార్థులు

జగద్గిరిగుట్ట: విద్యార్థులకు తమవంతు సాయం చేయడానికి ఎల్లవేళలా కృషి చేస్తామని సైబేజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ సీనియర్ సి.ఎస్.ఆర్ ఎగ్జిక్యూటివ్ అనపురపు సురేష్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని జగద్గిరిగుట్ట జిల్లా పరిషత్ హై స్కూల్, జగద్గిరినగర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గచ్చిబౌలిలోని సైబేజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ సామాజిక బాధ్యతలో భాగంగా సైబేజ్ ఆశ ప్రోగ్రాం ద్వారా 6 నుంచి 7వ తరగతి చదువుతున్న 300 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్, డ్రాయింగ్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, క్రయాన్ బాక్స్, వాటర్ బాటిల్స్ అందజేశారు. ప్రభుత్వ పాఠశాలకి కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించడంలో సైబేజ్ కంపెనీ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. కష్టపడి చదివి తల్లిదండ్రులకి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. భవిష్యత్‌లో పాఠశాల అభివృద్ధికి వివిధ కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు.

డ్రింకింగ్ వాటర్ స్టేషన్ ప్రారంభం

పాఠశాలలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన 6 వేల లీటర్ల డ్రింకింగ్ వాటర్ స్టేషన్‌ను సైబేజ్ కంపెనీ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ కిరణ్ కుమార్ ప్రారంభించారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో వెంకటేష్, తిరుపతి, కృష్ణ చైతన్య, సాయిరాం, సాయి మణికంఠ, దేవేంద్ర, సాయి ప్రసాద్, హుస్సేన్, వినేశ్, సాయి ప్రియ, సౌమ్య శర్మ, సంతోష్, హేమ కుమార్, హెచ్‌ఎం సుభాష్ చంద్రబోష్, సుధాకర్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

అతివేగంతో ఆర్టీసీ బస్సును ఢీకొన్న బైకు

- ఇద్దరి యువకులకు గాయాలు
- ఆసుపత్రికి తరలించిన పోలీసులు

జీడిమెట్ల: అతివేగంతో ద్విచక్ర వాహనం ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. దీంతో ఇద్దరి యువకులకు గాయాలయ్యాయి. ఈ ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ వివరాల ప్రకారం.. గాజులరామారానికి చెందిన శివకాంత్(19), వివేకానందనగర్‌కు చెందిన భానుకిరణ్(19) ఇద్దరు కలిసి శనివారం ఉదయం కేటీఎం బైక్‌పై గుడికి వెళ్తున్నారు. శివకాంత్ ద్విచక్ర వాహనం నడుపుతుండగా భానుకిరణ్ వెనక కూర్చున్నాడు. అదే క్రమంలో జీడిమెట్ల పీఎస్ వద్ద జీడిమెట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు యూటర్న్ తీసుకుంటుంది. ద్విచక్ర వాహనం వేగంగా వెళ్లి బస్సును ఢీకొట్టింది. పెద్ద శబ్దం రావడంతో ఆ సమయంలో జీడిమెట్ల పీఎస్‌లో ఇన్‌స్పెక్టర్ మల్లేష్ సిబ్బందితో పరేడ్ నిర్వహిస్తున్నారు. వెంటనే పోలీసులు అక్కడకు పరుగులు తీసి రక్తమోడుతున్న ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

జగద్గిరిగుట్ట: చింతల్ శ్రీ సాయి కాలనీలోని అభయాంజనేయ స్వామి, పోచమ్మవారి ఆలయ ప్రాంగణంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు ఉదయం ప్రత్యేక పూజలు జరిగాయి. హనుమాన్ అన్నప్రసాద సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం జరిగింది.

ఫిర్యాదు చేసి ఇంటికొచ్చేసరికి ..

అక్రమ నిర్మాణం కూల్చివేత

- హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన కాలనీవాసులు
- మూడు గంటల్లోనే కూల్చివేసిన సిబ్బంది
- హర్షం వ్యక్తం చేసిన రుక్మిణి ఎస్టేట్ కాలనీవాసులు



పార్కులో హైడ్రా సిబ్బంది కూల్చివేసిన అక్రమ నిర్మాణం

కుత్బుల్లాపూర్: ప్రజా అవసరాల కోసం వదిలిన పార్కు స్థలంలో అక్రమ నిర్మాణం చోటు చేసుకున్న విషయంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. మూడు గంటల్లోనే సమస్య పరిష్కారం కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని రుక్మిణి ఎస్టేట్ సర్వే నెంబర్ 218, 214 లో ఉన్న 1200 గజాల పార్కు స్థలం ప్రజా అవసరాల కోసం వదిలేశారు. ఈ స్థలంపై కొంతమంది కన్నేసి అందులో 600 గజాలను కబ్జా చేసేందుకు ప్రయత్నం చేసి గది, ప్రహరీ నిర్మించారు. ఈ విషయంపై స్థానిక సంక్షేమ సంఘం ప్రతినిధులు హైడ్రా కమిషనర్‌ను శుక్రవారం సాయంత్రం కలిసి ఫిర్యాదు చేశారు. ఇంటికి వచ్చేసరికి పార్కు స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణంతో పాటు ప్రహరీని కూల్చివేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. కూల్చివేయడమే కాకుండా హెచ్చరిక బోర్డును కూడా ఏర్పాటు చేయడం విశేషం. ఫిర్యాదు అందుకున్న కేవలం మూడు గంటల్లోనే స్పందించిన తీరుపై శనివారం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శేఖర్ ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకొని హైడ్రా జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



హైడ్రా జిందాబాద్ అంటూ ప్లకార్డులతో కాలనీవాసులు

ప్రమాదమని తెలిసినా 'రాంగ్' రూట్!



కుత్బుల్లాపూర్: జాతీయ రహదారిపై నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నా వాహనదారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు ఆయా ప్రాంతాల్లో యూటర్న్ ఏర్పాటు చేయగా.. కొంతమంది వాహనదారులు రాంగ్ రూట్‌లో వస్తూ ఇతర వాహనదారులకు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నారు. ముఖ్యంగా పేట్ బషీరాబాద్ పిస్తా హౌస్ ముందు సర్వీస్ రోడ్డుకు ఆనుకొని పార్కింగ్ చేస్తుండగా.. మరోవైపు తోపుడు బండ్లు ఏర్పాటు చేసి అమ్మకాలు చేపడుతున్నారు. ఇంకోవైపు రాంగురూట్‌లో వచ్చే వాహనాల వల్ల అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు అక్కడ ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి రాంగ్ రూట్లో వచ్చే వాహనాలను ఆపి జరిమానా వేసినా ఫలితం లేకుండా పోతుంది.

నాలా వంతెనపై పార్కింగ్

జగద్గిరిగుట్ట: చింతల్, గణేష్‌నగర్ నాలా వంతెన పనులు పూర్తి అయ్యాయి. వానా కాలంలో ఇబ్బందులను అధిగమించడానికి నాలా వెడల్పు చేశారు. కానీ ఈ వంతెన పైనా పార్కింగ్ చేయడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులకు టర్నింగ్ వద్ద పార్కింగ్ చేసిన వాహనాలతో ఇబ్బందులు, అలాగే ఉదయం స్కూల్ సమయంలో వచ్చే బస్సులతో ఇక్కడ తీవ్ర ట్రాఫిక్ జాం ఏర్పడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



'చెత్త' దారి



సుభాష్‌నగర్: ప్రజలకు ఆహ్లాదాన్ని ఇచ్చేందుకు ఆయుష్ వన్ పేరిట పార్కును ఏర్పాటు చేశారు. కొంతమంది ప్రజలు చెత్తను వేసి అపరిశుభ్రంగా మారుస్తున్నారు. బహదూర్‌పల్లి- కొంపల్లి ప్రధాన రోడ్డును అనుకొని ఆయుష్ వనం పార్క్ ముందు కొన్ని నెలలుగా చెత్తని వేసి ఇలా అపరిశుభ్రంగా మారుస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి చెత్త వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వాకర్స్ కోరుతున్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్ గ్రిల్



జగద్గిరిగుట్ట: పద్మానగర్ ఫేజ్ 2, తెలుగుతల్లి విగ్రహం టర్నింగ్ వద్ద మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు వెళ్లే ఈ దారిలో మ్యాన్‌హోల్ కుంగి ప్రమాదకరంగా మారింది. ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేశామని, అయినా అధికారులు స్పందించడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి ప్రమాదం జరుగకముందే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.